**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**జాతీయ వార్తలు**

తేదీ: 04-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

**ముఖ్యాంశాలు**

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశాలోని పూరీ బీచ్‌లో ఈరోజు నిర్వహించిన భారత నావికాదళం దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు.

- పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు ఉభయ సభల్లో ప్రభుత్వం కీలక బిల్లులను ప్రవేశ పెట్టింది.

- మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భారతీయ జనతా పార్టీ నాయకులు దేవేంద్ర ఫడ్నవీస్ రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

- భారత్ - చైనా దేశాల మధ్య సమర్థవంతమైన సరిహద్దు నిర్వహణపై దృష్టి సారిస్తున్నామని విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ తెలిపారు.

- "ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకం" కింద 38 లక్షల ఇళ్లు కేటాయించామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడించారు.

==========================

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఒడిశాలోని పూరీ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో నిర్వహించిన నావికాదళం దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత నావికాదళ కార్యాచరణ ప్రదర్శనను వీక్షించారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ... 1971 యుద్ధంలో సాధించిన అద్భుతమైన విజయానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. మాతృభూమి రక్షణలో నావికాదళ సిబ్బంది చేసిన నిస్వార్థ సేవ అత్యున్నత త్యాగాన్ని స్మరించుకోవాలన్నారు. నారీ శక్తికి మార్గం సుగమం చేయడంలో నావికాదళం ప్రయత్నాలను రాష్ట్రపతి ప్రశంసించారు. మహిళా అగ్నివీర్లను చేర్చిన మొదటి దళం నేవీ అని ద్రౌపది ముర్ము పేర్కొంటూ ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భారతీయ జనతా పార్టీ నాయకులు దేవేంద్ర ఫడ్నవీస్ రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ముంబై నగరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు మహాయుతి కూటమి నాయకుల సమక్షంలో దేవేంద్ర ఫడ్నవీస్ మూడవ సారి ప్రమాణం చేయనున్నారు. ఈరోజు జరిగిన భారతీయ జనతా పార్టీ కోర్ కమిటీ సమావేశంలో, బిజెపి కేంద్ర పరిశీలకులుగా నియమితులైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ సమక్షంలో దేవేంద్ర ఫడ్నవీస్ శాసనసభా పక్ష నేతగా ఎన్నికయ్యారు. శాసన సభ్యులు చంద్రకాంత్ పాటిల్, సుధీర్ ముంగంటివార్ ఫడ్నవీస్ పేరును ప్రతిపాదించగా.. దీనికి నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులందరూ మద్దతు ఇచ్చారు. కాగా దేవేంద్ర ఫడ్నవీస్ ఇదివరకు2014, 2019లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా భాద్యతలు నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్  బాయిలర్ల చట్టం 1923ను రద్దు చేస్తూ ప్రవేశపెట్టిన బాయిలర్ల బిల్లు 2024ను రాజ్యసభ ఆమోదించింది. బాయిలర్ లోపల పనిచేసే వ్యక్తుల భద్రతకు సమర్థులైన వ్యక్తులు చేపట్టే బాయిలర్‌ల మరమ్మత్తులను నిర్ధారించడానికి ఈ బిల్లును రూపొందించారు. మరోవైపు రైల్వేస్ (సవరణ) బిల్లు 2024ను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... రైల్వే శాఖలో మరింత సౌకర్యాన్ని తీసుకురావడానికి ఈ బిల్లును రూపొందించామన్నారు. గడచిన 10 సంవత్సరాల్లో 44 వేల రైల్వే నెట్వర్క్ లను విద్యుదీకరించామని వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఇదిలా ఉండగా మహిళల ద్వారా ప్రత్యేకంగా ప్రోత్సహించబడే సహకార సంఘాల అభివృద్ధికి నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NCDC) 7 వేల 708 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసిందని కేంద్ర సహకార శాఖా మంత్రి అమిత్ షా ఈరోజు రాజ్య సభకు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - చైనా సరిహద్దుల మధ్య శాంతిని పెంపొందించాల్సిన ఆవశ్యకతను భారత విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి ఎస్. జైశంకర్ ఈరోజు రాజ్యసభలో ప్రస్తావించారు. చైనాతో భారతదేశ సంబంధాలలో ఇటీవలి పరిణామాలపై ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఇరు దేశాల మధ్య చర్చలను మరింత ముందుకు తీసుకెళ్తామని అన్నారు. సమర్థవంతమైన సరిహద్దు నిర్వహణపై ఇరు దేశాలు దృష్టి సారిస్తున్నామని సభకు వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేవీ డే సందర్భంగా భారత నౌకాదళ సిబ్బందికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. నావికాదళంలోని పరాక్రమ సిబ్బంది అసమానమైన ధైర్యం అంకితభావంతో దేశ సముద్రాలను కాపాడుతున్నారని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. జాతీయ భద్రతా నిర్మాణంలోనూ భారతదేశ సముద్ర భద్రతను పరిరక్షించడంలోనూ భారత నౌకాదళం చాలా కీలకమని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈ సందర్భంగా పేర్కొంటూ... నేవీ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 5 సంవత్సరాల్లో 2 కోట్ల ఇళ్లను నిర్మిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడించారు. ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం 2 కోట్ల 95 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపిందన్నారు. "ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకం" కింద 38 లక్షల ఇళ్లు కేటాయించామని, వీటికి 10 వేల 600 కోట్ల రూపాయలకు పైగా నిధులు విడుదల చేశామన్నారు. "పియం జన్ మన్ పథకం" కింద, 2024 - 25 సంవత్సరానికి ప్రత్యేకంగా గిరిజన కుటుంబాలకు 46 వేలకు పైగా ఇళ్లను కేటాయించామని మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శిరోమణి అకాలీదళ్ పార్టీ నాయకులు పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై అమృత్ సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద ఈరోజు హత్యాయత్నం జరిగింది. గోల్డెన్ టెంపుల్ ప్రవేశద్వారం వద్ద సుఖ్‌బీర్ సింగ్ బాదల్ వీల్ ఛైర్‌పై కూర్చొని ఉండగా నారాయణ్ సింగ్ అనే వ్యక్తి కాల్పులు జరపడానికి ప్రయత్నించారు. సుఖ్‌బీర్ సింగ్ బాదల్ భద్రతా సిబ్బంది ఆ ప్రయత్నాన్ని నిలువరించడంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనపై అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లర్ మాట్లాడుతూ... నరేన్ సింగ్ అనే ఉగ్రవాది సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం చేశాడని అతన్ని అరెస్టు చేశామని చెప్పారు. ఇదిలా ఉండగా సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై జరిగిన దాడిని కేంద్ర సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు ఖండించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని పార్లమెంట్ వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నష్టాల్లో ఉన్న టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్‌ను 2019లో ప్రభుత్వం పొడిగించిన పునరుద్ధరణ ప్యాకేజీ లాభదాయకంగా మార్చిందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ఈరోజు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... 50 వేల మంది బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల భద్రత ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ధాన్యం నిల్వ అవసరాలను పరిష్కరించడానికి ఉద్దేశించిన అతిపెద్ద ధాన్యం నిల్వ ప్రణాళిక పైలట్ ప్రాజెక్టు విజయవంతమయ్యింది. సహకార రంగంలో ప్రతిష్టాత్మకమైన ప్రపంచంలోని అతిపెద్ద ధాన్యం నిల్వ ప్రణాళికలో భాగంగా భారతదేశంలోని 11 రాష్ట్రాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల గోడౌన్‌లను విజయవంతంగా నిర్మించారు. వీటిలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం, తెలంగాణ, త్రిపుర రాజస్థాన్ రాష్ట్రాలు ఉన్నాయి. నేషనల్ కో - ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NCDC), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (NABARD), నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సహకారంతో ఈ ప్రాజెక్టు మొత్తం 9 వేల 750 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లో జరుగుతున్న అండర్-19 ఆసియా కప్‌లో భారత్ సెమీఫైనల్ కు చేరుకుంది. షార్జా క్రికెట్ స్టేడియంలో ఈరోజు యుఎఇ జట్టుతో జరిగిన గ్రూప్-ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈకి భారత్ కు 138 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత్ కేవలం 16.1 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

===========================